


నేటి పత్రిక
# ప్రజా వార్త
NETI PATRIKA PRAJA VARTHA
తెలుగు వారపత్రిక



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...



విజయవాడ | తేదీ: 24 - 30 జూన్ 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 54 | పేజీలు : 4, వెల: రూ.5


# ప్రతి పేద విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి

- నాలుగో ఏడాది అమ్మ ఒడి సాయం విడుదల చేసిని సీఎం వైఎస్ జగన్
- పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేలా గవర్నమెంట్ బడి

**విజయనగరం, నేటి పత్రిక ప్రజావార్త :**
జగనన్న అమ్మఒడి నాలుగో సంవత్సరానికి సంబంధించి 42,61,965 మందికి లబ్ధి చేకూరుస్తూ రూ.6,392.94 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేశారు. వర్గాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రతి ఇంటి నుంచి సత్య నాదెళ్ల రావాలని సీఎం వైఎస్ జగన్ ఆకాంక్షించారు. తమది చదువుల సంకల్పమని స్పష్టం చేశారు. విదేశీ కాలేజీల్లో సీటు తెచ్చుకుంటే ఫీజు రూ.1.25 కోట్లయినా భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన బహిరంగ సభలో అశేష జనసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. పోటీ ప్రపంచంలో తట్టుకొని నిలబడాలని, ప్రపంచాన్నే ఏలే పరిస్థితిలోకి పిల్లలు రావాలనే గట్టి సంకల్పంతో ఈ నాలుగేళ్లుగా మీ బిడ్డ ప్రభుత్వం అడుగులు వేసిందని చెప్పారు. అందులో భాగంగానే అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నామని, నాలుగో ఏడాది కార్యక్రమాన్ని కురుపాం వేదికగా ప్రారంభిస్తున్నామన్నారు. పది రోజులపాటు ప్రతి మండలంలోనూ పండగ వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, విద్యార్థులతో ప్రజా ప్రతినిధులంతా మమేకమవుతారని తెలిపారు. ఈ పథకం ద్వారా ఒకటి నుంచి 12వ తరగతి దాకా పిల్లలను చదివిస్తున్న 42 లక్షల 62 వేల మంది అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. తద్వారా 83 లక్షల 15 వేల మంది విద్యార్థులకు మంచి చేస్తున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా తల్లులకు అమ్మఒడి వర్తింపజేస్తున్నామని, ఈ ఒక్క పథకం ద్వారా నాలుగేళ్లలో ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా నేరుగా వారి ఖాతాల్లో రూ.26,067 కోట్లు జమ చేశామని స్పష్టం చేశారు. కళ్లెదుటే మార్పు కనిపిస్తోందన్నారు. నాడు-నేడుతో 45 వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాం. 8వ తరగతి పిల్లలకు, టీచర్లకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా విద్యను అందించేలా ట్యాబ్స్ అందిస్తున్నదీ మీ మేనమామ ప్రభుత్వమే. ఆడపిల్లల కోసం స్వేచ్ఛ అనే పథకాన్ని అమలు చేస్తున్నాం. పెద్ద చదువుల కోసం వంద శాతం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో జగనన్న విద్యా దీవెన ఇస్తోంది మీ మేనమామ ప్రభుత్వంలోనే. మెస్, హాస్టల్ ఖర్చుల కోసం వసతి దీవెన కార్యక్రమాన్నీ అమలు చేస్తున్నామన్నారు. పిల్లలు ఇంకా గొప్పగా చదవాలి. ప్రతి కుటుంబం నుంచి సత్యనాదెళ్ల రావాలి. విదేశాల్లో చదవాలన్నా తల్లిదండ్రులకు ఇబ్బందులు ఉండకూడదనే విదేశీ విద్యా దీవెన పథకం తీసుకొచ్చాం. పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేలా గవర్నమెంట్ బడి వెలుగుతోంది.







గిరిజన ప్రాంతంలో ఒకప్పుడు వైద్యానికి దిక్కులేని పరిస్థితి. ఇప్పుడు ఐదు ఐటీడీఏల పరిధిలో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు కడుతున్నాం. ఉత్తరాంధ్రకు సంబంధించిన గిరిజన ప్రాంతంలో కొత్తగా కురుపాం, పాడేరు, నర్సీపట్నంలో మెడికల్ కాలేజీలు రాబోతున్నాయి. నాలుగోది విజయనగరంలో నిర్మాణంలో ఉంది. వచ్చే నెలలో ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయబోతున్నాం. గిరిజనులను గుండెల్లో పెట్టుకున్నది మీ బిడ్డ ప్రభుత్వమే. ఐదుగురు ఉప ముఖ్యమంత్రులుంటే వారిలో మొట్టమొదటి గిరిజన డిప్యూటీ సీఎంగా ఈ రాష్ట్రంలో పనిచేసిన చరిత్ర నా సోదరి, కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణిది. ఇప్పుడు మరో గిరిజనుడు పీడిక రాజన్నదొర డిప్యూటీ సీఎంగా పని చేస్తున్నారు. ట్రైబల్ అడ్వయిజరీ కమిటీని సకాలంలో వేసిన చరిత్ర మనదే. నామినేటెడ్ పదవి అయినా, కాంట్రాక్ట్ అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కచ్చితంగా 50 శాతం కేటాయించాలని చట్టం చేశాం. మన కళ్లెదుటే గ్రామ సచివాలయాల్లో 1.30 లక్షల మంది ఉద్యోగులుగా ఉన్నారు. వారిలో నా ఎస్టీలు, ఎస్సీలు, బీసీలు, మైనార్టీలు 84 శాతం మంది కనిపిస్తున్నారు. నవరత్నాలను మారుమూల గిరిజన గ్రామాలకు చేర్చాలని తపన పడుతున్నామన్నారు.

# అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో చేర్పించేలా చూడండి

సజ్జల రామకృష్ణారెడ్డి



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేకదృష్టి పెట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల పరిశీలకులను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో 2014-19 మధ్య అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు అరాచకాలకు పాల్పడి దొంగ ఓట్లను చేర్పించారని గుర్తుచేశారు. దాదాపు 68 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయని తేలిందని ఎత్తిచూపారు. ఆ దొంగ ఓట్లను గుర్తించి, వాటి తొలగింపునకు కృషిచేయాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా అర్హులైన వారిని ఓటర్లుగా చేర్పించాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం 175 నియోజకవర్గాల పార్టీ పరిశీలకులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిశీలకులు మరింత కీలకంగా, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేసిన మేరకు 175 నియోజకవర్గాలకు 175 గెల్చుకోవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నియోజకవర్గాలపై అవగాహన పెంచుకోవాలని, స్థానిక సమస్యలు, వాటి పరిష్కారం, అక్కడి ప్రతిపక్షాల పాత్ర వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. వారంలో కనీసం రెండురోజులు నియోజకవర్గాల్లో ఉండి పార్టీని మరింత బలోపేతం చేసేదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే లేదా పార్టీ సమన్వయకర్తకు తలలో నాలుకలాగా మెలుగుతూ కీలకంగా ఉండాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే సమన్వయంతో పరిష్కరించడానికి కృషిచేయాలని సూచించారు. స్థానిక నేతల అభిప్రాయాలు విభిన్నంగా ఉంటే వాటిని పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ల దృష్టికి, పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. జగనన్న సురక్ష పథకం నియోజకవర్గాల్లో ఏ విధంగా జరుగుతోంది.. ప్రజలకు సంబంధించి అన్ని సమస్యల పరిష్కారం, పథకాలను లబ్దిదారులకు అందించేలా సమన్వయం చేయడం వంటి వాటిపైన కూడా దృష్టిపెట్టాలని కోరారు. గృహసారథులు, గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు.. మండల, డివిజన్ పార్టీ నేతలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజలు అత్యంత విశ్వాసంతో ఉన్నారని.. రానున్న ఎన్నికలలో పార్టీ విజయం తథ్యమని చెప్పారు. అయినప్పటికి నియోజకవర్గాలలో పార్టీ స్థితిగతులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# ట్రిపుల్ ఐటీలకు 38,100 దరఖాస్తులు

**నూజివీడు, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పీయూసీ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం 38,100 దరఖాస్తులు వచ్చినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సోమవారంతో ముగిసిందని పేర్కొన్నారు. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1000 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద అదనంగా మరో 100 సీట్లు కలిపి 1100 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను జూలై 13న ప్రకటించనున్నట్లు చెప్పారు. కాగా, కరోనా కారణంగా గత మూడేళ్లుగా ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు నిర్వహించి మార్కులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపికను నిర్వహించనున్నారు.




# జులై 24న పది రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

## ముగియనున్న కేంద్రమంత్రి జైశంకర్ పదవీకాలం



**న్యూఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**
జులై 24న రాజ్యసభకు ఎన్నికలు జరగనున్నాయి. కేంద్రమంత్రి ఎస్ జైశంకర్ సహా పది మంది సభ్యుల పదవీకాలం పూర్తవనుండటంతో జూలై 24న రాజ్యసభకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఏడాది జులై-ఆగస్ట్ మధ్య పశ్చిమ బెంగాల్, గోవా, గుజరాత్ నుంచి ఈ 10 స్థానాలు ఖాళీ అవుతున్నట్లు పేర్కొంది. కాగా అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో ఆరు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గుజరాత్‌లో మూడు, గోవాలో ఒక స్థానం ఖాళీ కానుంది. ఆయా స్థానాలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ జులై 6న విడుదలవుతుందని తెలిపింది. జూలై 13 వరకు నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణకు జులై 17న చివరి తేదీగా పేర్కొంది. 24న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నట్లు వెల్లడించింది.

**పదవికాలం ముగియనున్న వారు..**
పశ్చిమ బెంగాల్‌లో డెరెక్ ఓబ్రియెన్, డోలా సేన్, ప్రదీప్ భట్టాచార్య, సుస్మితా దేవ్, శాంత ఛెత్రి, సుఖేందు శేఖర్ రాయ్‌ల పదవీకాలం ముగియనుంది. గుజరాత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, దినేష్ జెమల్‌భాయ్ అనవాదియా, లోఖండ్‌వాలా జుగల్ సింగ్ మాథుర్‌జీల పదవీకాలం కూడా ముగియనుంది. గోవా నుంచి ఎంపీ వినయ్ డీ టెండూల్కర్. గత ఏడాది జులైలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ నాలుగు రాష్ట్రాల్లోని ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ మూడు స్థానాలను నిలబెట్టుకోగా, రాజస్థాన్, మహారాష్ట్రల్లో ఒక్కో స్థానంలో గెలుపొందింది. అదే విధంగా పశ్చిమ బెంగాల్‌లోని ఒక రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. గోవా మాజీ ముఖ్యమంత్రి లుజిన్హో ఫలేరో తన స్థానానికి, తృణమూల్ కాంగ్రెస్‌కు రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది.

# ఒకేరోజు ఐదు వందే భారత్ రైళ్లు

**భోపాల్, నేటి పత్రిక ప్రజావార్త :**
మధ్యప్రదేశ్ నుంచి ఐదు వందే భారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. వీటిలో రెండిటిని ప్రత్యక్షంగా ప్రారంభించగా మూడింటిని మాత్రం వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో ప్రధాని ప్రకటించిన 75 వందే భారత్ రైళ్లలో ఇప్పటికి 23 రైళ్లు పట్టాలెక్కాయి. మధ్యప్రదేశ్ షాహ్డోల్ జిల్లాలో పర్యటించిన ప్రధాని మొదట భోపాల్ రాణి కమలాపాటి రైల్వే స్టేషన్ చేరుకుని భోపాల్-ఇండోర్, భోపాల్-జబల్ పూర్ మధ్య వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. అనంతరం గోవా-ముంబై, ధార్వాడ్-బెంగుళూరు, హతియా-పాట్నా వందేభారత్ రైళ్లను కూడా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈరోజు ప్రారంభించిన రైళ్లు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచుతాయని.. మధ్యప్రదేశ్, కర్ణాటక, గోవా, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల మధ్య అనుబంధాలను మరింత మెరుగుపరుస్తాయని అన్నారు. వాణిజ్యపరంగా, పర్యాటకంగా కూడా ఈ కనెక్టివిటీ ఉపయోగపడుతుందని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, గవర్నర్ మంగుభాయ్ పటేల్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చోహాన్, కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, జ్యోతిరాదిత్య సింధియా పాల్గొన్నారు.

# సంస్థ అభివృద్ధికి కృషి చేద్దాం... రాబడిని పెంచుదాం

- ఎం.డి.ద్వారకా తిరుమలరావు



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆర్టీసీవంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆర్జించే రాబడిలో ఏ ఒక్క రూపాయి కూడా నష్టపోని తీరులో తనిఖీ వ్యవహారాలు నిర్వహించడం, ప్రయాణీకులకు నాణ్యమైన సేవలందించడంలో కండక్టర్లు, డ్రైవర్లు తమ బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చేలా మరియు వారు క్రమశిక్షణతో వ్యవహరించేలా చూడడంలోనూ తనిఖీ అధికారులు తమవంతు బాధ్యతలు రాజీ లేకుండా నిర్వర్తించాలని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.ద్వారకా తిరుమలరావు, ఐ.పి.ఎస్ అన్నారు. మంగళవారం విజయవాడ, విద్యాధరపురం నందలి ఎపిఎస్ఆర్‌టిసి ట్రాన్స్‌పోర్ట్ అకాడమీలో, రాష్ట్రంలోని వివిధ హెడ్ క్వార్టర్ స్క్వాడ్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్, రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్ ఇంచార్జులు హాజరైన సమీక్షా సమావేశానికి ఎం.డి ద్వారకా తిరుమలరావు విచ్చేసి వివిధ తనిఖీ విభాగాల ఇంచార్జ్‌లను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశానికి హాజరైన వివిధ స్క్వాడ్‌ల పెర్ఫార్మెన్స్ మరియు పనితీరును సమీక్షించారు. ఏ ప్రజా రవాణా సంస్థలోనైనా ఆదాయాన్ని పెంపొందించుకోవడం, రాబడిలోని ప్రతి రూపాయిని జాగ్రత్తగా కాపాడుకోవడం, సంస్థ ఉద్యోగుల సంక్షేమాన్ని కాంక్షించడం చాలా ప్రధానమని ఆయన తెలిపారు. అందులో బస్సు రాబడిని జాగ్రత్తగా సంరక్షించే బాధ్యత తనిఖీ అధికారులదేనన్నారు. బస్సు తనిఖీ అధికారులు సంస్థ అభివృద్ధిలో తమ వంతు బాధ్యతలు నిర్వహించాల్సిన తీరు తెన్నుల గురించి ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎం.డితో పాటుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎ. కోటేశ్వరరావు, సిటీఎం (మార్కెటింగ్) విజయగీత, ట్రాన్స్పోర్ట్ అకాడమీ ప్రిన్సిపాల్ కుమారి డి.సాంబ్రాజ్యం, డిప్యూటీ సిటీఎం (మార్కెటింగ్) జాన్ సుకుమార్ ఇంకా తదితర అధికారులు పాల్గొన్నారు.

# మీకు జరిగిన ఈ మంచిని.. ప్రతి పేదవాడికి తిరిగి బదిలీ చేయండి : సీఎం జగన్




**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ఏపీ రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 2,677 మంది యువ న్యాయ వాదుల ఖాతాల్లో నెలకు రూ.5 వేల స్టైఫండ్ చొప్పున 2023-24 సంవత్సరానికి మొదటివిడత 'వైఎస్సార్ లా నేస్తం' ఆర్థిక ప్రోత్సాహకాన్ని సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు (5 నెలలు) రూ. 25 వేల చొప్పున మొత్తం రూ.6,12,65,000 జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ యువ న్యాయవాదులకు అండగా నిలుస్తూ ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ లా నేస్తం' లాంటి పథకం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదని తెలిపారు. యువ న్యాయవాదులు వృత్తిలో ప్రవేశించిన తొలి మూడేళ్ల పాటు ఆర్థికంగా ఊతమిచ్చేలా ఈ పథకాన్ని రూపొందించామన్నారు. నాలుగేళ్లుగా లా నేస్తం పథకాన్ని అమలు చేస్తూ ఇప్పటివరకు 5,781 మందికి మొత్తం రూ.41.52 కోట్లు అందించినట్లు చెప్పారు. న్యాయవాదులు లా కోర్సు పూర్తి చేసిన మొదటి మూడేళ్లు ప్రాక్టీస్‌పరంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే చదువులు పూర్తై కోర్టుల్లో అడుగుపెడుతున్న తరుణంలో వారి కాళ్లమీద వాళ్లు నిలబడేలా తోడుగా నిలిచి నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదిలో రూ.60 వేలు ఇస్తున్నాం. మూడేళ్లలో ఇలా ఒక్కొక్కరికీ రూ.1.80 లక్షలు అందిస్తున్నాం. దీనివల్ల వృత్తిలో ఇబ్బంది పడకుండా నిలదొక్కుకుని ముందుకు వెళ్తారన్న ఆలోచనతో ఈ పథకాన్ని ప్రారంభించాం. ఇది ఒక మంచి ఆలోచన, మంచి కార్యక్రమం. ఇలాంటి ఆలోచన, ఇలాంటి పథకం కేవలం మన రాష్ట్రంలో మాత్రమే అమలు జరుగుతోంది. ఇదొక్కటే కాకుండా అడ్వకేట్లకు అన్ని రకాలుగా మంచి జరగాలనే ఉద్దేశంతో రూ.100 కోట్లతో అడ్వొకేట్ జనరల్ ఆధ్వర్యంలో ఇప్పటికే వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశాం. మెడిక్లెయిమ్, న్యాయవాదుల అవసరాలకు రుణాలు లాంటి వాటికి ఈ ఫండ్ నుంచి రూ.25 కోట్లు సహాయం చేశాం. ఈ రెండు కార్యక్రమాల ద్వారా అడ్వొకేట్లకు రాష్ట్ర ప్రభుత్వం తోడుగా ఉందనే సంకేతం వెళ్లింది. ఇంత మనసు పెట్టి ఈ కార్యక్రమాన్ని చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి నేను న్యాయవాదులను కోరేది ఒక్కటే. జూనియర్ న్యాయవాదులకు ఈ పథకం ద్వారా మంచి జరిగితే వారు వృత్తిలో స్థిరపడ్డాక ఇదే మమకారాన్ని పేదల పట్ల చూపిస్తారని విశ్వసిస్తున్నా. ఈ మంచిని ప్రతి పేదవాడికి తిరిగి బదిలీ అయ్యేలా గుర్తుంచుకోవాలని కోరుకుంటున్నా. వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఆర్నెళ్లకు కలిపి ఒకేసారి మొత్తం రూ.30 వేలు అందిస్తే జూనియర్ న్యాయవాదులకు ఇంకా బాగా ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో క్రితంసారి మార్పులు చేశాం. మళ్లీ డిసెంబరులో ఈ ఏడాది రెండో దఫాకి సంబంధించిన కార్యక్రమం జరుగుతుంది.

వీటన్నింటి వల్ల న్యాయవాదులకు మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, లా సెక్రటరీ జి.ప్రభాకర్, న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 50 కోట్లు డిపాజిట్‌లకు చేరి త్వరలో 2 బ్రాంచీలకు ఆర్.బి.ఐ అనుమతి పొందిన శ్రీ శారదాంబా బ్యాంకు



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
శ్రీ శారదాంబ మహిళ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ సమావేశం స్థానిక గాయత్రీ కళ్యాణ మండపంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కోపరేటివ్ బ్యాంక్ ఛైర్‌పర్సన్ శిష్టా కుసుమ లావణ్యదేవి మాట్లాడుతూ ఈ బ్యాంకు 25 సంవత్సరాలుగా విజయవంతంగా నడుస్తూ 26వ సంవత్సరంలో అడుగు పెట్టిందని అన్నారు మొదట 13 కోట్ల రూపాయలతో ప్రారంభమైన బ్యాంకు 50 కోట్లు డిపాజిట్ వరకు చేరుకుందని త్వరలోనే 2 బ్రాంచీలకు ఆర్.బి.ఐ అనుమతి లభించిందని, త్వరలోనే ఏర్పాటు చేస్తామని, అన్నారు ముఖ్యంగా మహిళ షేర్ హోల్డర్స్ కు డైరెక్టర్లకు కస్టమర్ దేవుళ్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అభివృద్ధికి సహకరించిన, వారికి బ్యాంకు సేవలు అందించే సిబ్బందికి శాలువాలుతో సత్కరించారు. తదనంతరం బ్యాంక్ డైరెక్టర్స్ మాట్లాడుతూ అన్ని బ్యాంకులకు దీటుగా అన్ని పథకాలలో మా బ్యాంకు ముందుకు సాగుతుందని, సీనియర్ సిటిజన్స్‌కు ఎన్నో పథకాలు ఉన్నాయని అన్ని దిగ్విజయంగా నడుస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా మా మహిళ షేర్ హోల్డర్స్‌కు మరియు డిపాజిట్‌దారులుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పా లక్ష్మీదేవి, రాయంపూడి అమూల్య, గందూరి లక్ష్మీ అపర్ణ, వి.నాగమణి, మద్ది జ్ఞానమాంబ, పి.రాధిక, బ్యాంకు సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఆపిల్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆపిల్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం విజయవాడ నక్కల్‌రోడ్‌లో ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు ప్రముఖ యూరాలజిస్ట్ అండ్ లాప్రోస్కోపీ సర్జన్ డాక్టర్ డి.కిరణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో ఆపిల్ ఆస్పిటల్ నుండి 7,000 మందికి వైద్య సదుపాయం అందించామని, వెయ్యిమంది ఇన్ పేషెంట్‌లుగా చేరగా అందులో 750 మందికి సర్జరీలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని తెలిపారు. హాస్పిటల్లో అభివృద్ధికి కృషిచేసిన తోటి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ అయినటువంటి డాక్టర్ కె.వి.గురువర్ధన్ కుమార్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఐ.హెచ్.ఎస్.కాత్యాయిని, సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ ఎం.జ్యోతి మరియు హాస్పిటల్స్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆపిల్ హాస్పిటల్స్ పేషెంట్స్ మరియు వారి బంధువులకు అవసరమైన అయిన ఓపిడి, డయాగ్నోస్టిక్ సేవలపై 50 శాతం తగ్గింపు మరియు శస్త్ర చికిత్సలపై ప్రత్యేక తగ్గింపు ఈనెల 24వ తేదీ నుండి 30వ తేదీవరకు అందిస్తున్నామన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.వి.గురువర్ధన్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ హ్యాపీ హాస్పిటల్‌లో ఆధునిక పరిజ్ఞానంతో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. సిటీలో ఉన్న ఇతర హాస్పిటల్ కన్నా మా ఆపిల్ హాస్పిటల్లో అతి తక్కువ ధరల్లో సర్జరీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా వైద్యసేవలు, శస్త్రచికిత్సలపై ఇస్తున్న తగ్గింపు అవకాశాన్ని నగర ప్రజలతోపాటు చుట్టు ప్రక్కల వున్న వారు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యచికిత్స పొంది ఆరోగ్యాన్ని పొందిన పేషెంట్‌లు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాల సమస్యలపై అప్రమత్తంగా ఉండండి



**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**
వానాకాలంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు ఆదేశించారు. మ్యాన్‌హోల్స్, నాలాలు, వరదనీటి కాలువల వల్ల గతంలో తలెత్తిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని పట్టణాల్లో ఆయా మునిసిపాలిటీలు చేపట్టిన వర్షాకాల సన్నద్ధత ప్రణాళికలపై పురపాలక శాఖలోని వివిధ విభాగాల అధికారులతో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పురపాలికలతోపాటు హైదరాబాద్‌లో తలెత్తే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా ప్రాణ నష్టం జరగకుండా చూడటమే అధికారుల ప్రథమ ప్రాధాన్యత అని, ఆ దిశగా యంత్రాంగం పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ చేపట్టిన ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు పనుల పురోగతిని ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలలో అవసరమైన డీవాటరింగ్ పంపులు, ఇతర ఏర్పాట్లు చేసుకుని సన్నద్ధంగా ఉండాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. నగరవ్యాప్తంగా ప్రారంభించిన వార్డు కార్యాలయాల పనితీరుపైన మంత్రి కేటీఆర్ ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల వ్యవస్థ ప్రారంభ దశలోనే ఉన్నదని, ఈ దశలో ఎదురయ్యే సవాళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకు పోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ పలువురు నగర పౌరులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు, వాటి పరిష్కారం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు.

## కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును కలిసిన ఐఏఎస్ ప్రొబేషనర్స్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును కలిసిన ఐఏఎస్ ప్రొబేషనర్స్ (ఏపీ క్యాడర్ అసిస్టెంట్ కలెక్టర్స్ అండర్ ట్రైనింగ్ 2022 బ్యాచ్) వీరిలో బి.స్మరణ్ రాజ్ (అనకాపల్లి జిల్లాకు అలాట్‌మెంట్), బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్ (విజయనగరం), సి.యశ్వంత్ కుమార్ రెడ్డి (తూర్పుగోదావరి), కల్పశ్రీ కే.ఆర్ (పల్నాడు), మంత్రి మౌర్య భరద్వాజ్ (వైఎస్సార్ జిల్లా), రాఘవేంద్ర మీనా (శ్రీకాకుళం), సౌర్య మన్ పటేల్ (ప్రకాశం), తిరుమణి శ్రీ పూజ (ఏలూరు), వి.సంజనా సింహా (ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు) ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ లబ్దిదారునికి చేరువ చేస్తూ సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండాలని సూచిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కలెక్టర్ డిల్లీరావు సూచన మేరకు యువ అధికారులు జిల్లాలో అమలు జరుగుతున్న పౌరసరఫరాల శాఖ పనితీరును పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. పర్యటన అనంతరం నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సబ్ కలెక్టర్ అదితి సింగ్, యువ ఐఏఎస్ అధికారులకు విధి నిర్వహణలో భాగంగా అనుసరించాల్సిన విధానాలను మార్గదర్శనం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా వివిధ దశలలో కార్డు దారులకు నిత్యావసర వస్తువులు చేరే విధానం, ఇందులో భాగంగా అందిస్తున్న నిత్యావసర సరుకుల స్టాక్‌పాయింట్ నుండి మొబైల్ డిస్పర్సింగ్ వాహనం ద్వారా లబ్దిదారులకు అందిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ పై రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ, ధాన్యం కొనుగోలు వంటి అంశాలను ఆసక్తిగా పరిశీలించి అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## చతుర్వేద హవనం నిర్వహణకు సర్వం సిద్ధం

**– జులై 5వతేదీ వరకు హవనం**

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**
లోక కల్యాణార్థం జూన్ 29 నుండి జులై 5 తేదీ వరకు టీటీడీ పరిపాలన భవనంలోని మైదానంలో శ్రీశ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. టీటీడీ తొలిసారి తిరుపతిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. జూన్ 29వ తేదీ గురువారం ఉదయం 8 గంటలకు కలశ స్థాపన, కలశ ఆవాహనతో కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఇందుకోసం యజ్ఞ వేదిక, హోమ గుండాలు సిద్ధంచేశారు. 32 మంది రుత్వికులు నాలుగు వేదాల్లోని మంత్రాలు పఠిస్తూ హవనం నిర్వహిస్తారు. భక్తులు కూర్చుని కార్యక్రమం వీక్షించేందుకు వీలుగా మ్యాట్లు, చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, బ్యారికేడ్లు, భక్తులను ఆకట్టుకునేలా పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు చేశారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు చతుర్వేద హవనంలో అన్ని వేదాల్లోని మంత్రాలు పఠిస్తూ హోమ కార్యక్రమాలు జరగనున్నాయి. సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు చతుర్వేద మంత్ర పారాయణం జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుండి 6-30 గంటల వరకు వై ఎల్ శ్రీనివాసులు, బి.కేశన్న బృందం నాదస్వరం, డోలు వాద్య సంగీతం నిర్వహిస్తారు. 6-30 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు డాక్టర్ ఎ.శబరి గిరీష్ బృందంచే భజనామృతం జరుగుతుంది. రాత్రి 7 నుండి 7-45 గంటల వరకు ఆచార్య చిర్రావూరి శ్రీరామశర్మచే చతుర్వేద హవనం-కార్య సిద్ధి అనే అంశంపై ప్రవచనం ఉంటుంది. రాత్రి 7-50 గంటల నుండి 8-30 గంటల వరకు పి.రవిసుబ్రహ్మణ్యం బృందంచే రామాయణం నృత్య రూపకం ప్రదర్శన ఉంటుంది.

భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరడమైనది.

## ఉచిత బియ్యం.. బదులు డబ్బులు

**కర్ణాటక సర్కారు కీలక నిర్ణయం**



**బెంగళూరు, నేటి పత్రిక ప్రజావార్త :**
కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీల్లో ఒకటైన అన్నభాగ్య పథకం అమలుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పథకాన్ని జులై 1 నుంచి అమల్లోకి తీసుకురావాల్సి ఉండగా.. అందుకు అవసరమైన బియ్యం సేకరణ సాధ్యం కావట్లేదు. దీంతో సిద్ధరామయ్య సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఉచిత బియ్యానికి బదులుగా నగదు ఇస్తామని ప్రకటించింది. కిలో బియ్యానికి రూ.34 చొప్పున ఐదు కిలోల బియ్యానికి సమానమైన డబ్బును బీపీఎల్ ఖాతాదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు తెలిపింది. ఈ మేరకు బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంది.

## "పృథ్వీ మోటార్ సైకిల్స్" వారి షైన్ 100 సిసి వాహనం ఆవిష్కరణ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
గుడివాడ పట్టణం పామర్రు రోడ్డులో "పృథ్వీ మోటార్ సైకిల్స్" వారి షైన్ 100 సిసి వాహనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జోనల్ మేనేజర్ సేల్స్ శరద్ ఉంద్రే, జోనల్ మేనేజర్ సర్వీస్ రాహుల్ కుమార్, ఏరియా సేల్స్ మేనేజర్ మంజునాథ్ పాటిల్, ఏరియా మేనేజర్ సర్వీస్ హర్షరెడ్డి, హోండా బిజినెస్ సపోర్ట్ నరేంద్ర పూనియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "పృథ్వీ మోటార్ సైకిల్స్" షోరూం ఛైర్మన్ మలెంపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటు ధరలలో నాణ్యమైన అత్యంత ఆధునీకతతో కూడిన వాహనంగా షైన్ 100 సిసి ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా హోండా కంపెనీ వారు 10 సం॥ వారెంటీ ఇస్తున్నట్లు తెలియచేయుటకు సంతోషిస్తున్నారు. షైన్ 100 సిసి అన్ని రకములైన వినియోగదారులకు చేరువవుతుందని తెలియజేస్తూ వాహనం నడుపు సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని తెలియచేశారు. షైన్ 100 సిసి వాహనం కీను కస్టమర్స్ దూసి విద్యాధర్‌కి, జి.కృష్ణంరాజుకి అతిథుల చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో కస్టమర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొలగాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు తోపుడు బండ్లు పంపిణీ, అన్నదానం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నెహ్రూ బొమ్మ సెంటర్ కొత్తపేటలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి గుడి ఆవరణలో బుధవారం రవికృష్ణ మాతృమూర్తి కీ॥శే॥ గొలగాని లక్ష్మీ దుర్గాంబ 82వ జయంతి సందర్భంగా ప్రవాసాంధ్రులు గొలగాని రవికృష్ణ ఆధ్వర్యంలో గొలగాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి తల్లిదండ్రుల పేరు మీద పశ్చిమ నియోజకవర్గం లోని వెనకబడిన వర్గాలకు చెందిన పేద మహిళలకు జీవనోపాధి నిమిత్తం ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి ముఖ్య అతిథులు తెలుగుదేశం పార్టీ 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి చంటి మాట్లాడుతూ గొలగాని రవికృష్ణ ఎక్కడో విదేశాల్లో ఉండి విజయవాడలోని అనేక సేవా కార్యక్రమాలు చేయడం చాలా ఆనందదాయకమని అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ గొలగాని రవికృష్ణ తన తల్లి దండ్రుల పేరు మీద వారి తల్లి జయంతి సందర్భంగా పేదవారికి రెండు తోపుడు బళ్లను ఇవ్వటమే కాకుండా 200 మందికి అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించరన్నారు. రవికృష్ణ కరోనా కష్టకాలంలో కూడా ఎంతో సేవలందించరన్నారు. ప్రైవేటు స్కూలులో పనిచేసే ఉపాధ్యాయులకు, సినిమా థియేటర్లో పనిచేసే సినీ కార్మికులకు అలాగే శానిటరీ, పోలీస్ సిబ్బందికి ఎంతోమందికి నిత్యావసర సరుకులు తో పాటు కూరగాయలు బట్టలు పంపిణీ చేయడం చాలా ఆనందదాయకం అన్నారు. ఇలాంటి మంచి మనసున వ్యక్తులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలి అని, ఇలాంటి వారు రావడం వలన పేద ప్రజలకు ఎంతో సేవ చేస్తారన్నారు. పల్లా దుర్గమ్మ సీపీఐ మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ రవికృష్ణ తన తల్లిదండ్రుల పేర్లను నిలబెట్టిన గొప్ప మనసున్న మనిషి అని అతను సేవా కార్యక్రమాలు చాలా చక్కగా నిర్వహిస్తున్నాడని ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 10 తోపుడు బండ్లు పలువురు పేద బడుగు బలహీన వర్గాలకు వారి జీవనోపాధి నిమిత్తం అందజేయడం జరిగిందన్నారు. అతనికి ఆ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు భోగావల్లి శ్రీధర్ మాట్లాడుతూ రవికృష్ణ అనేక సేవా కార్యక్రమాలు కరోనాలోనే కాకుండా ఎంతో మందికి ఆర్థికంగా ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నవారికి ఆర్థిక సాయం అందించడంలో ముందున్న వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో పొట్నూరి చక్రధర్, దుక్కా వేణు, బిసి సంఘం నాయకులు నమ్మి అప్పారావు, నమ్మి భాను, యాదవ కళ్యాణ మండపం సెక్రటరీ మురిపాల దుర్గారావు, దేవర సురేష్, బొట్ట నాగేంద్ర, బొట్ట అర్జున్, ఆవాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లలోనే డిగ్రీ ప్లస్ బీఈడీ



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

సమీకృత బీఈడీ కోర్సులు ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ తర్వాత నాలుగేళ్లలోనే డిగ్రీతో పాటు బీఈడీ పూర్తి చేయవచ్చు. సాధారణంగా బీఈడీ చేయాలంటే మూడేళ్ల డిగ్రీ పూర్తి చేసి, రెండేళ్ల బ్యాచులర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోర్సు చేయాలి. దీనికి మొత్తం ఐదేళ్లు పడుతుంది. కొత్త విధానం వల్ల నాలుగేళ్లలోనే పూర్తి చేసే వీలుంది. జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా తీసుకొచ్చిన ఈ కోర్సును జాతీయ స్థాయిలో పలు కళాశాలల్లో ప్రవేశపెడుతున్నారు. వీటిలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దేశ వ్యాప్తంగా 178 పట్టణాల్లో 13 మాధ్యమాల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ) నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం అర్ధరాత్రి ఎన్‌టీఏ విడుదల చేసింది. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో రెండు వర్సిటీల్లో ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.

ఎన్టీఏ 2023-24 విద్యా సంవత్సరానికి తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఎచ్చెర్లలోని బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మొత్తం 150 సీట్లలో ప్రవేశాలు కల్పించనున్నారు. ఆధునిక విద్యా బోధనకు అనుగుణంగా సమీకృత బీఈడీ కోర్సును ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించింది. విద్యార్థి మానసిక ధోరణి, ఆన్‌లైన్, డిజిటల్ విద్యా బోధనతో పాటు సరికొత్త మెలకువలతో ఎలా బోధించాలన్న అంశానికి ఈ కోర్సులో అత్యధిక ప్రాధాన్యమిస్తారు. తరగతి గదిలో పాఠాల కన్నా, అనుభవం ద్వారా నేర్చుకునే రీతిలో పాఠ్య ప్రణాళిక రూపొందించినట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రవేశ పరీక్ష ఇలా : ఇంటర్ ఉత్తీర్ణులు ఈ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. పన్నెండో తరగతి, ఇంటర్ సిలబస్‌లోంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 160 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్, టీచింగ్ అప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 19.7.2023**
- **డేటా కరెక్షన్‌కు చివరి తేదీ 20.7.2023**
- **పరీక్ష తేదీ తర్వాత ప్రకటిస్తారు**
- **హాల్ టికెట్ల డౌన్‌లోడ్ పరీక్షకు మూడు రోజుల ముందు**
- **దరఖాస్తు చేసుకోవాల్సిన వెబ్‌సైట్లు:** www.nta.ac.in, https://neet. samarth.ac.in/

# పేదరిక నిర్మూలనకు చదువే మార్గదర్శకం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మఒడి పథకంలో భాగంగా బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గ్రామం నుండి అమ్మఒడి నాలుగో విడతకు సంబంధించిన నగదును ముఖ్యమంత్రి బటన్ నొక్కి లబ్ధిదారుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన జిల్లా కలెక్టర్ యస్ ఢిల్లీరావు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, శాసనసభ్యులు మల్లాదివిష్ణువర్ధన్, శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాస్, డిప్యూటి మేయర్లు బెల్లం దుర్గ, అవుతూ శ్రీ శైలజారెడ్డి, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సంపత్ విజిత, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గౌస్‌మొహిద్దీన్ కార్పొరేషన్ల చైర్మన్లు టి.శ్రీకాంత్, యం.శివరామకృష్ణ, కె.గీతాంజలి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమలపూర్ణమ్మ, జిల్లా విద్యాధికారి సివి రేణుక, అధికారులు నాలుగో విడత అమ్మఒడి పథక లబ్దిదారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు చదువే మార్గదర్శకం అని రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 1 లక్ష 70 వేల 587 మంది తల్లులకు 255 కోట్ల 88 లక్షల 5 వేల రూపాయలను అమ్మఒడి పథకంలో నాలుగో విడతగా లబ్దిదారుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ఒకటో తరగతి నుండి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు చదువు మధ్యలో మానివేయకుండా ఆర్థిక సహాయం అధించే విధంగా ప్రతి పేద విద్యార్థి తల్లుల ఖాతాలకు ఏడాదికి రూ. 15 వేలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు లబ్ది చేకూరుతుందన్నారు. ఈనెల 31వ తేది నుండి జూలై 7వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలోని పాఠశాలలలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్య ద్వారానే కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయనే సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి అమ్మఒడి, జగనన్న విద్య దీవెన, నాడు-నేడు వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అమ్మఒడిని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్ళేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు.

మాజీమంత్రి, శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పేదరికంతో రాష్ట్రంలో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుడదనే సంకల్పంతో జగనన్న అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఏడాది 15 వేల రూపాయలను విద్యార్థుల తల్లు ఖాతాలకు నేరుగా జమ చేస్తూన్నారన్నారు. మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలలో అత్యాధునిక మౌలిక వసతులను కల్పించి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు.

# బిఎస్‌సి నర్సింగ్ కోర్స్ పూర్తి చేసిన వారికి జర్మనీలో స్టాఫ్ నర్సెస్‌గా అవకాశం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

బిఎస్‌సి నర్సింగ్ కోర్స్ పూర్తి చేసిన వారికి జర్మనీలో స్టాఫ్ నర్సెస్‌గా అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసీ)- టిఏకెటి ఇంటర్నేషనల్- ఆంధ్రప్రదేశ్ నాన్- రెసిడెంట్ తెలుగు సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బిఎస్సి నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీ లో స్టాఫ్ నర్సెస్ గా అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు 20 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి కనీసం 2 సంవత్సరాలు సాధారణ ఆసుపత్రులలో పని చేసిన అనుభవం ఉండాలన్నారు. జర్మన్ భాష నేర్చు కునేందుకు ఆసక్తి జర్మనీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు, అర్హులైన అభ్యర్థులకు కెఎల్ విశ్వవిద్యాలయంలో జర్మన్ భాష శిక్షణ కోసం ఉచిత ఆన్లైన్ తరగతులకు హాజరు కావాలి. బి1 స్థాయి ఉత్తీర్ణత సాధించిన తర్వాత, జర్మనీలో పని చేయడానికి ఆఫర్ లెటర్ ఇవ్వబడుతుందని తెలిపారు. అభ్యర్థులకు జర్మనీ ప్రయాణం కోసం విమాన చార్జీలు ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. మొదటి 6 నెలల పాటు ఆహారం, వసతి ఉచితమని, నెలకు వేతనం వెయ్యి యూరోలు (భారతీయ కరెన్సీ రూ. 89,000, అనంతరం ఆరు నెలల పాటు జర్మనీలో బి2 సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తారన్నారు. బి2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు దాదాపు 2,500 యూరోల వేతనం పొందవచ్చునని చెప్పారు. ఈనెల 30 తేది రిజిస్ట్రేషన్‌కు చివరి తేది అని www.apssdc.in/home/onlineprogramregistration ఆసక్తిగ ల అభ్యర్థులు సర్టిఫికేట్ రెజ్యూమ్‌ని helpline@apssdc.in మెయిల్ ఐడి లేదా కాల్ సెంటర్: 9988853335 నంబరుకు పంపించాలని కలెక్టర్ డిల్లీరావు ఆ ప్రకటనలో తెలిపారు.

# వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు జూన్ 30 గడువు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

2023-24 ఆర్థికసంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వడ్డి లేకుండా చెల్లించడానికి ఈ నెలాఖరు అనగా జూన్ 30, 2023 వరకు మాత్రమే అవకాశము ఉన్నందున పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్నులను సకాలములో చెల్లించవలసినదిగా కోరటమైనది. ప్రజల సౌకర్యార్థము నగరపాలక సంస్థ సర్కిల్స్ పరిధిలోని అన్ని క్యాష్ కౌంటర్లు శెలవు రోజుఅనగా 29.06.2023 తేదీన (బక్రీదు) ఉదయం 10.30 నుంచి 5.00 గంటల వరకు పనిచేయునని తెలియజేయుటమైనది. కావున పన్ను చెల్లింపుదారులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగము చేసుకొనిపన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించ వలసినదిగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరటమైనది.

# 8న వైఎస్సార్ జయంతి రోజు ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

సీఆర్‌డీఏ పరిధిలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన నిరుపేదల సొంతింటి కల సాకారం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సీఆర్‌డీఏ పరిధిలో 50,793 మంది అక్కచెల్లెమ్మలకు 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇంటి స్థలాలను ఇప్పటికే ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా గృహ నిర్మాణ శాఖ చర్యలు చేపట్టింది. సీఆర్‌డీఏ పరిధిలో మొత్తం 25 లేఅవుట్లలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన 22,125 మంది లబ్దిదారులు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 22,976 మంది ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇచ్చే ఆప్షన్-3ని ఎంపిక చేసుకున్నారు. మొత్తం లబ్దిదారుల్లో 88.79 శాతం మంది ఆప్షన్-3కి మొగ్గు చూపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా జూలై 8వ తేదీన సీఆర్‌డీఏ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటి నిర్మాణానికి ఒక్కో యూనిట్‌కు బిల్లుల రూపంలో రూ.1.80 లక్షలు, పావలా వడ్డీకి రూ.35 వేలు బ్యాంకు రుణంగా సమకూరుస్తూ రూ.2.15 లక్షలు చొప్పున అందిస్తోంది. దీనికి అదనంగా ఉచితంగా ఇసుకతోపాటు సబ్సిడీపై స్టీల్, సిమెంట్ లాంటి 14 రకాల నిర్మాణ సామగ్రిని ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. వీటి విలువ రూ.54,518 వరకు ఉంటుంది. ఇదే తరహాలో సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల లబ్ధిదారులకు కూడా ప్రభుత్వం అండగా నిలవనుంది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ 31 లక్షల మందికిపైగా పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. రెండు విడతల్లో 21.25 లక్షల ఇళ్ల (సాధారణ ఇళ్లు 18.63 లక్షలు ం టిడ్కో ఇళ్లు 2.62 లక్షల ఇళ్లు) నిర్మాణాలకు అనుమతులు ఇవ్వగా నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. సాధారణ ఇళ్లలో సుమారు నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. ఇళ్ల పథకం ద్వారా ఒక్కో పేదింటి మహిళకు సగటున రూ.15 లక్షల స్థిరాస్తిని సమకూర్చడం ద్వారా మొత్తం రూ. 3 వేల కోట్ల మేర సంపదను ప్రభుత్వం సృష్టిస్తోంది.

సీఆర్‌డీఏ పరిధిలో మెజారిటీ లబ్ధిదారులు ఆప్షన్-3 ఎంచుకున్నారు. లబ్ధిదారులను గ్రూపులుగా చేసి ట్యాగ్ చేసే పనులు రెండు జిల్లాల్లో కొనసాగుతున్నాయి. 47 వేల ఇళ్లకు సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (సీఎస్ఎంసీ) అనుమతులు వచ్చాయి. మిగిలిన ఇళ్లకు కూడా అనుమతులు వస్తాయి. గృహ నిర్మాణాలకు జూలై 8న శంకుస్థాపన నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు.

# వాసవ్య మహిళా మండలి కార్యాలయ ఆవరణలో జాబ్ మేళా



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఉద్యోగ నియామకాలను కోరుకునే వ్యక్తులకు ఉపాధి అవకాశాలను కల్పించడం లక్ష్యంగా వాసవ్య మహిళా మండలి పెట్టుకుంది. ఈ కార్యక్రమం విజయవాడలోని బెంజ్‌సర్కిల్ వద్ద గల వాసవ్య మహిళా మండలి కార్యాలయ ఆవరణలో జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం పది కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి, వివిధ స్థానాలకు తగిన అభ్యర్థుల ఎంపిక జరిగింది. వాసవ్య మహిళా మండలి విజయవాడ నిర్వహించిన జాబ్ మేళా, ఉద్యోగార్థులకు మరియు యజమానులకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి, ఈ ప్రాంతంలోని వ్యక్తులకు ఉపాధి అవకాశాలను సులభతరం చేయడానికి ఒక వేదికగా ఉపయోగపడింది. ఉద్యోగ అన్వేషకులను శక్తివంతం చేయడం ద్వారా మరియు ప్రాంతం యొక్క ఆర్థిక వృద్ధికి దోహదపడటం ద్వారా స్థానిక కమ్యూనిటీకి మద్దతు ఇవ్వడంలో వాసవ్య కీలక పాత్ర పోషించింది. వాసవ్య మహిళా మండలి విజయవాడ నిర్వహించిన జాబ్ మేళా, ఉద్యోగార్థులకు మరియు యజమానులకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి, ఈ ప్రాంతంలోని వ్యక్తులకు ఉపాధి అవకాశాలను సులభతరం చేయడానికి ఒక వేదికగా ఉపయోగపడింది. ఉద్యోగ అన్వేషకులను శక్తివంతం చేయడం ద్వారా మరియు ప్రాంతం యొక్క ఆర్థిక వృద్ధికి దోహదపడటం ద్వారా స్థానిక కమ్యూనిటీకి మద్దతు ఇవ్వడంలో వాసవ్య కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమంలో 73 మంది వ్యక్తులు ఉపాధిని పొందాలనే ఆశతో హాజరవడంతో ప్రోత్సాహకరమైన ఓటింగ్ జరిగింది.

ఈ హాజరైనవారు విభిన్న నేపథ్యాల నుండి వచ్చారు మరియు అనేక రకాల నైపుణ్యాలు మరియు అర్హతలను కలిగి ఉన్నారు. రోజంతా, అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొనే కంపెనీల ప్రతినిధులతో వారి సామర్థ్యాలను మరియు సామర్థ్యాన్ని ప్రదర్శించారు. కఠినమైన ఎంపిక ప్రక్రియ తర్వాత, వివిధ రంగాలలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయడానికి వివిధ కంపెనీలు 22 మంది అభ్యర్థులను విజయవంతంగా ఎంపిక చేశాయి. ఎంపికైన అభ్యర్థులు వారి సంబంధిత రంగాలలో విశేష నైపుణ్యాలు మరియు పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. వారి ఎంపిక వారి వ్యక్తిగత విజయాన్ని సూచించడమే కాకుండా అర్హులైన అభ్యర్థులను కాబోయే యజమానులతో అనుసంధానించడంలో వాసవ్య పునాది వేసింది.

# ఎంబీబీఎస్ పాస్‌తోపాటు పీజీ మెడికల్‌లో ప్రవేశానికీ కీలకంగా నెక్ట్స్ పరీక్ష

**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**

వైద్యవిద్యలో నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్ట్స్) విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఈ ఏడాది నుంచే దాన్ని అమలులోకి తేవాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం ఎంబీబీఎస్ పాస్‌కు, తర్వాత రిజిస్ట్రేషన్, మెడికల్ ప్రాక్టీస్‌కు కూడా ఈ పరీక్ష పాస్ కావడం తప్పనిసరి. అలాగే పీజీ మెడికల్ సీటులో ప్రవేశం కూడా నెక్ట్స్ అర్హతతోనే ఉంటుంది. అంటే నీట్ పీజీ పరీక్ష రద్దవుతుంది.

అలాగే విదేశీ వైద్యవిద్యకు గుర్తింపు కూడా ఈ పరీక్ష ద్వారానే ఉంటుంది. అంటే వీటన్నింటికీ ఇదే కీలకమైన పరీక్షగా ఉంటుంది. నెక్ట్స్‌ను ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తయ్యే విద్యార్థులతో ప్రారంభిస్తారు. నెక్ట్స్-1, నెక్ట్స్-2 అనే పరీక్షలు నిర్వహిస్తారు. నెక్ట్స్-1 ఏటా మే, నవంబర్ నెలల్లో రెండుసార్లు ఉంటుంది. ఆ పరీక్ష జరిగిన నెలలోపే ఫలితాలు ప్రకటిస్తారు. ఈ ఏడాది మొదటిసారిగా నవంబర్‌లో పరీక్ష జరగనుంది. ఇప్పుడు ఎంబీబీఎస్ కోర్సు పూర్తయ్యేవారు ఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది. నెక్ట్స్-1 తర్వాత ప్రాక్టికల్స్ ఉంటాయి.

ఆ తర్వాత హౌస్‌సర్జన్ పూర్తిచేశాక నెక్ట్స్-2ను జూన్ మూడో వారం లేదా డిసెంబర్‌లో నిర్వహిస్తారు. నెక్ట్స్-2కు సప్లమెంటరీ పరీక్ష ఉంటుంది. ఏటా మార్చి లేదా సెప్టెంబర్‌లో నిర్వహిస్తారు. నెక్ట్స్-1ను దేశవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) పద్ధతిలో నిర్వహిస్తారు. నెక్ట్స్-2 పూర్తిగా ప్రాక్టికల్ పరీక్షే. దీన్ని సంబంధిత ఆరోగ్య విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

నెక్ట్స్-1 పరీక్షకు అర్హత కటాఫ్ 50% ఉంటుంది. అప్పుడు ఉత్తీర్ణత సాధించినట్లుగా పరిగణిస్తారు. ఇంటర్న్‌షిప్ ప్రారంభించడానికి అర్హులు. ఇంటర్న్‌షిప్ తర్వాత పీజీ సీట్లను కేటాయించడంలో నెక్ట్స్-1లో సాధించిన స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటారు. పీజీ ప్రవేశ ర్యాంకింగ్ కోసం నెక్ట్స్ పరీక్ష స్కోర్ మూడేళ్లపాటు చెల్లుబాటు అవుతుంది. అయితే నెక్ట్స్-2 పరీక్ష పీజీ సీట్ల కేటాయింపునకు దోహదం చేయదు. ఇది అర్హత పరీక్ష మాత్రమే.

అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా వైద్యవిద్యలో నాణ్యతను పెంచడమే లక్ష్యంగా ఎన్ఎంసీ నెక్ట్స్ పరీక్షకు శ్రీకారం చుడుతోంది. జాతీయ స్థాయిలో ఏకీకృత పరీక్షను పెట్టడం ద్వారా దేశవ్యాప్తంగా ఒకే నాణ్యమైన వైద్యవిద్యను అందించాలని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినవారికి ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామ్ (ఎఫ్ఎంజీఈ) నిర్వహిస్తున్నారు.

అందులో పాసైతేనే ఇండియాలో డాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, ప్రాక్టీస్ చేయడానికి, ప్రభుత్వ వైద్య ఉద్యోగాల్లో చేరడానికి అనుమతి ఉంది. అయితే ఎఫ్ఎంజీఈ పరీక్ష ఎంతో కఠినంగా ఉండటంతో పరీక్ష రాసే వారిలో 20 శాతానికి మించి అర్హత సాధించలేకపోతున్నారు. దీంతో అనేకసార్లు ఈ పరీక్ష రాయాల్సి వస్తోంది.

చాలా మంది అర్హత సాధించలేక ఇతరత్రా వృత్తుల్లో స్థిరపడిపోయినవారున్నారు. ఇప్పుడు వాళ్లు కూడా నెక్ట్స్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇది పాస్ కాకుంటే ఎంబీబీఎస్ పట్టా ఇవ్వరు. దేశంలో వైద్యవిద్యకు ఒకే పరీక్షగా, వైద్యవిద్యను క్రమబద్ధీకరించడానికి ఇది నిర్వహించాలన్నది ఎన్ఎంసీ ఉద్దేశమని చెబుతున్నారు.

నెక్ట్స్‌పై అవగాహనకు ఈ ఏడాది ఎంబీబీఎస్ చదివే విద్యార్థుల కోసం మాక్ టెస్ట్ నిర్వహించాలని ఎన్ఎంసీ నిర్ణయించింది. వచ్చే నెల 28న ఆ పరీక్ష నిర్వహిస్తారు. అందుకోసం బుధవారం (జూన్ 28) నుంచి దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు ఎన్ఎంసీ సూచించింది. నెక్ట్స్-1 మాక్ టెస్టును ఢిల్లీ ఎయిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

నెక్ట్స్-1ను ఎంబీబీఎస్ థియరీ పరీక్షకు బదులుగా నిర్వహిస్తున్నందున మూడు రోజులపాటు రోజు విడిచి రోజు ఈ పరీక్ష ఉంటుంది. మెడిసిన్ ఆలైడ్ సబ్జెక్టు పరీక్ష 3 గంటలపాటు నిర్వహిస్తారు. 120 మల్టీపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. అలాగే సర్జరీ, ఆలైడ్ సబ్జెక్టుల నుంచి 120 ప్రశ్నలు 3 గంటలపాటు ఉంటుంది. ఓబీజీ 120 ప్రశ్నలు, మూడు గంటలు ఉంటుంది. పీడియాట్రిక్స్ పరీక్ష 60 ప్రశ్నలకు గంటన్నరపాటు ఉంటుంది. ఈఎన్‌టీ పరీక్షకు 60 ప్రశ్నలు... గంటన్నర సమయం ఉంటుంది.



ఆఫ్తాల్మాలజీ పరీక్ష 60 ప్రశ్నలు... మూడు గంటలు ఉంటుంది. ఉదయం సాయంత్రం వేళల్లో పరీక్ష నిర్వహిస్తారు. నెక్ట్స్-2 పరీక్ష పూర్తిగా ప్రాక్టికల్ పరీక్ష మాత్రమే. క్లినికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. రోగులను పరీక్షించే పరీక్ష నిర్వహిస్తారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు. నెక్ట్స్ పరీక్షకు సంబంధించి కొంత గందరగోళం ఉందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్ఎంసీకి లేఖ రాయాలని వర్సిటీ నిర్ణయించింది.

# సెప్టెంబర్ నెలాఖరుకు వెలిగొండ పూర్తి

## - నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు



**శ్రీశైలం, నేటి పత్రిక ప్రజావార్త :**
పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సెప్టెంబర్ నెలాఖరుకి నిర్మాణం పూర్తి చేసి నీటిని విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఆయన మంగళవారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి కొల్లంవాగు వద్ద, మండల పరిధిలోని కొత్తూరు వద్ద జరుగుతున్న సొరంగం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టుతో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు పుష్కలంగా జలాలు వస్తాయని తెలిపారు. ఈ జిల్లాల్లోని 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, లక్షలాది మందికి తాగు నీరు అందుతుందని తెలిపారు. ప్రకాశం జిల్లాలో స్టేజ్-1 కింద 1.20 లక్షల ఎకరాలకు, స్టేజ్-2 కింద 2.55 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని వివరించారు. సుంకేశుల నుంచి తీగలేరు కెనాల్‌కు నీరు తరలించడం ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గంలో 62 వేల ఎకరాల బీడు భూములు సాగులోకి వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి సొరంగం నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, రెండో సొరంగం పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మరో కిలోమీటరు మేర పనులు జరగాల్సి ఉందన్నారు. ఈ పనులన్నీ మూడు నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు నష్టపరిహారాన్ని అందించిన తర్వాతే నల్లమల సాగర్‌లో దశల వారీగా నీటిని నింపుతామని చెప్పారు. ఎంతో ఉన్నత లక్ష్యంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ ప్రాజెక్టును ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరితగతిన పూర్తి చేస్తున్నారని అన్నారు. సాధ్యమైనంత త్వరలో నల్లమల సాగర్‌ను నింపి ప్రజలకు నీరందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు.

మంత్రులు అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్ వెలిగొండ సొరంగంలో సాహస యాత్ర చేశారు. కొల్లంవాగు నుంచి మండల పరిధిలో వెలిగొండ ప్రాజెక్టు సొరంగం పనులు జరుగుతున్న కొత్తూరు వరకు దాదాపు 19 కిలోమీటర్లు సొరంగ మార్గంలోనే ప్రయాణించారు. మంగళవారం శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం మయిత్రులు రోప్‌వే ద్వారా పాతాళగంగకు చేరుకున్నారు.అనంతరం బోట్‌లో కృష్ణానదిలో ప్రయాణించి కొల్లంవాగుకు చేరుకున్నారు. అక్కడ హెడ్ రెగ్యులేటర్, ఇతర పనులను పరిశీలించారు. అక్కడి నుంచి బొలెరో వాహనాల్లో మొదటి సొరంగం గుండా 13 కిలోమీటర్లు ప్రయాణించారు. అనంతరం 6 కిలోమీటర్లు రెండో సొరంగం గుండా ప్రయాణించి కొత్తూరు చేరుకున్నారు. గాలి కూడా ఉండని ఇరుకు సొరంగ మార్గాల గుండా మంత్రులు ప్రయాణించటం సాహసమేనని పలువురు అధికారులు పేర్కొన్నారు. మంత్రుల వెంట మంత్రి సురేష్ తనయుడు విశాల్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, సీఈ మురళీనాథ్‌రెడ్డి ఉన్నారు.

## అక్టోబర్ 9న అరుణాచలం గిరి ప్రదక్షిణ కొరకు ప్రత్యేక బస్సులు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
దక్షిణభారతంలో వెలసిన పంచలింగ క్షేత్రములలో "అరుణాచలం" ఒకటి. తిరువన్నామలై (అరుణాచలం)లో అరుణాచలేశ్వరడుని "అగ్ని/తేజో" లింగంగా భక్తులు ఆరాధిస్తారు. ఇక్కడ అరుణగిరి కొండ చుట్టూ ప్రదక్షిణం చేయటం సాక్షాత్తు శివునికి ప్రదక్షిణచేసినట్టుగాభావిస్తారు. ముఖ్యంగా ప్రతి పౌర్ణమి నాడు గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం కొరకు భక్తులు ఎక్కువగా అరుణాచలం చేరుకుంటారు. ప్రయాణీకులు పౌర్ణమి ముందు రోజు వివిధ ప్రాంతముల నుండి బయలుదేరి, పౌర్ణమి నాడు తిరువన్నామలై చేరిగిరి ప్రదక్షిణ గావించి, శివదర్శనంచేసుకొని తిరుగు ప్రయాణమవుతూ ఉంటారు. ఎపిఎస్ఆర్‌టిసి తిరువన్నామలై ( అరుణాచలం) పుణ్య క్షేత్రానికి భక్తుల సౌకర్యం కొరకు మొదటి సారి 2022 అక్టోబర్ 9 న గిరి ప్రదక్షిణ కొరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటమైనది. అక్టోబర్ 2022 నుండి మార్చి 2023 వరకు 6 నెలల్లో 338 ప్రత్యేక బస్సులు వివిధ డిపోల నుండి ఈ పుణ్యక్షేత్రానికి భక్తుల సౌకర్యార్థం నడపటం జరిగినది.ఎపిఎస్ఆర్‌టిసి వారి బస్సు సదుపాయం అందుబాటు ధరలో ఉండటం మరియు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం వలన భక్తుల నుండి విశేష స్పందన లభించింది. భక్తుల నుండి వచ్చిన విశేష స్పందన మరియు ఆదరణ మేరకు ఏప్రియల్ 2023 నుండి జూన్ 2023 వరకు, కేవలం 3 నెలల్లో 483 ప్రత్యేక బస్సులు నడపడం జరిగింది. వైశాఖ పౌర్ణమి (తేది 05.05.2023) నాడు ఒక్క రోజు 196 బస్సులు ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తం మీద గడిచిన 9 నెలల్లో 821 ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా ఆర్‌టిసి, రూ. 3.50 కోట్లు ఆర్జించింది. ఎపిఎస్ఆర్‌టిసి ఏర్పాట్లు మరియు సేవలు వినియోగించుకున్న భక్తులందరికి ధన్యవాదములు తెలుపు కుంటూ రాబోయే మాసములలో ఎపిఎస్ఆర్‌టిసి ఏర్పాటు చేయు బస్సులకు ఒఒఒ.ఖజూంతీఎశీఅశ్రీఱఅవ.ఱఅ నందు ముందస్తు రిజర్వేషన్ చేసుకొని సేవలు సద్వినియోగము చేసుకొని పౌర్ణమి నాడు అరుణాచలేశ్వరుని దర్శించుకొనగలరని ఎపిఎస్ఆర్‌టిసి కోరుతోంది.

## త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ రంగానిదే భవిష్యత్తు



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ రంగంలో వెల్లువెత్తుతున్న ఉపాధి అవకాశాలను పాలిటెక్నిక్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. సాంకేతిక విద్యా శాఖ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్-విశాఖపట్నం) సహకారంతో బుధవారం రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల అధ్యాపకులు, విద్యార్థుల కోసం త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీస్‌పై వెబినార్‌ను నిర్వహించారు. పరిశ్రమ నిపుణులచే సమన్వయంతో నిర్వహించే వెబినార్లు పరిశ్రమలు అనుసరిస్తున్న నూతన సాంకేతిక పద్ధతులపై ఖచ్చితమైన అవగాహన కలిగిస్తాయని నాగరాణి అన్నారు. సదస్సులో కీలక ఉపన్యాసం చేసిన ప్రింటెలిటిక్స్ %--% బెంగుళూర్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ అభిషేక్ శాస్త్రి మాట్లాడుతూ త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ విభిన్న రంగాలలో కీలక పాత్రను పోషిస్తుందన్నారు. సిఇఎంఎస్ సిఇఓ సేతు మాధవన్, సిఓఓ గోపికృష్ణ మాట్లాడుతూ తయారీ, మౌలిక సదుపాయాలు, మేరీటైమ్ రంగాలలో నైపుణ్యాభివృద్ధి పరంగా సిఇఎంఎస్ పాత్రను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 55 ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల నుండి 1,432 మంది విద్యార్థులు, 264 మంది మెకానికల్ , ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు ఈ వెబ్‌నార్ లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## యుపిఎస్‌సి పరీక్షలకు పకడ్బందీఏర్పాట్లు చేయండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
యుపిఎస్‌సి ద్వారా నిర్వహించే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జూలై నెల 2వ తేదీ ఆదివారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పరీక్షల నిర్వహణకు చేయవలసిన ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేది ఉదయం 9:30 నుండి 11:30 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష, మధ్యాహ్న 2:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షకు 7,890 మంది అభ్యర్థులు, అసిస్టెంట్ ప్రోవిడెంట్ ఫండ్ కమిషనర్ పరీక్షకు 7,955 మంది మొత్తంగా 15,845 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు నగరంలో 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పటమట కెబిసి జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్లో ఉదయం 57మంది మధ్యాహ్నం 46 మంది మొత్తంగా 103 మంది విభిన్న ప్రతిభావంతులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు 780 మంది ఇన్విజిలేటర్లు, 54 మంది అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, 19 మంది లైజనింగ్ ఆఫీసర్లు, 17 మంది వెన్యూ సూపర్‌వైజర్లు పర్యవేక్షించ నున్నారన్నారు. పరీక్షల ఓవరాల్ ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్, కస్టోడియన్ అధికారిగా డిఆర్‌వో కె. మోహన్‌కుమార్‌లు వ్యవహరిస్తారన్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొనేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందితో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని ఎపిఈపిడిసిఎల్ అధికారులను, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా నగరపాలక సంస్థ అధికారులను కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, ఆర్‌డివో రవీంద్రరావు, అడిషనల్ కమీషనర్ శ్యామల, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఐఆర్‌సిటిసి శుభవార్త

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
తిరుమల గిరులపై కొలువైన ఏడుకొండలవాడిని దర్శించుకోవాలనుకునేవారికి ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ఐఆర్‌సిటిసి ఒక శుభవార్త వినిపించింది. విశాఖపట్నం నుంచి వీకెండ్‌లో తిరుమల దర్శన్ టూర్ ప్యాకేజీని ప్రకటించింది. ప్రతి శుక్రవారం ఇది అందుబాటులోకి తీసుకువచ్చారు. శ్రీవారి దర్శనంతోపాటు శ్రీనివాస మంగాపురం, తిరుచానూర్, కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలను దర్శించుకోవచ్చు. వెంకటేశ్వరస్వామివారి దర్శనానికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ ఈ ప్యాకేజీలో కలిపే ఉండటం విశేషం. వీకెండ్‌లో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకోవాలనుకునేవారికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది. ప్రతి శుక్రవారం విశాఖపట్నంలో మధ్యాహ్నం 2.00 గంటలకు తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కడంతో యాత్ర ప్రారంభమవుతుంది. తర్వాతరోజు ఉదయం 4.05 గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. హెూటల్‌లో రెడీ అయిన తర్వాత కాణిపాకం, శ్రీనివాస మంగాపురంలోని ఆలయాలను సందర్శిస్తారు. అదేరోజు రాత్రికి తిరుపతిలో బస ఉంటుంది. మూడోరోజు ఉదయం శ్రీకాళహస్తి, తిరుచానూరు వెళతారు. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత తిరుమలలో ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉంటుంది. స్పెషల్ ఎంట్రీ దర్శనంద్వారా శ్రీవారిని దర్శించుకోవచ్చు. అనంతరం తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది. రాత్రి 8.30 గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కితే తెల్లవారి 11.30 గంటలకు వైజాగ్ చేరుకుంటారు. దీంతో యాత్ర సమాప్తమవుతుంది. కంఫర్ట్‌లో ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.12,375, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.13,250, స్టాండర్డ్‌లో ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.10,280, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.11,160 గా నిర్ణయించారు. కనీసం నలుగురు నుంచి ఆరుగురు వరకు బుక్ చేసుకునేవారికి ఇవి వర్తిస్తాయి. ఒకరు లేదంటే ఇద్దరు లేదంటే ముగ్గురు వరకు బుక్ చేసుకునేవారికి ప్యాకేజీ ధర కాస్తంత ఎక్కువగా ఉంది. కంఫర్ట్‌లో ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.12,695, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.15,200, సింగిల్ ఆక్యుపెన్సీకి రూ.25,510, స్టాండర్డ్‌లో ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.10,600, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.13,105, సింగిల్ ఆక్యుపెన్సీకి రూ.23,415 చెల్లించాలి.కంఫర్ట్ క్లాస్‌కు థర్డ్ ఏసీ ప్రయాణం, స్టాండర్డ్ క్లాస్‌కు స్లీపర్ క్లాస్ ప్రయాణం, ఏసీ హెూటల్‌లో బస, బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్, తిరుమలలో స్పెషల్ ఎంట్రీ దర్శనం, కాణిపాకం, శ్రీనివాస మంగాపురం, శ్రీకాళహస్తి, తిరుచానూర్ ఆలయాల్లో దర్శనం టికెట్, ట్రావెల్ ఇన్స్యూరెన్స్ కవరవుతాయి. ప్యాకేజీ బుక్ చేయడానికి https://www.irctctourism.com వెబ్‌సైట్‌ను సందర్శించాలి

## సీఎం జగన్‌ను కలిసిన ఐఏఎస్ ప్రొబేషనర్స్



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ క్యాడర్‌కు చెందిన 10 మంది ఐఏఎస్ ప్రొబేషనర్స్ (2022 బ్యాచ్) సోమవారం కలిశారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేలా పనిచేస్తూ, సామాన్యుడికి సైతం అందుబాటులో ఉంటూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లకు సీఎం మార్గనిర్దేశం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బి.స్మరణ్ రాజ్, బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, కల్పశ్రీ కే.ఆర్, కుషల్ జైన్, మౌర్య భరద్వాజ్, రాఘవేంద్ర మీనా, సౌర్యమన్ పటేల్, తిరుమణి శ్రీ పూజ, వి.సంజనా సింహ ఉన్నారు.

## తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఐఆర్‌సిటిసి శుభవార్త

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
తిరుమల గిరులపై కొలువైన ఏడుకొండలవాడిని దర్శించుకోవాలనుకునేవారికి ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ఐఆర్‌సిటిసి ఒక శుభవార్త వినిపించింది. విశాఖపట్నం నుంచి వీకెండ్‌లో తిరుమల దర్శన్ టూర్ ప్యాకేజీని ప్రకటించింది. ప్రతి శుక్రవారం ఇది అందుబాటులోకి తీసుకువచ్చారు. శ్రీవారి దర్శనంతోపాటు శ్రీనివాస మంగాపురం, తిరుచానూర్, కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలను దర్శించుకోవచ్చు. వెంకటేశ్వరస్వామివారి దర్శనానికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ ఈ ప్యాకేజీలో కలిపే ఉండటం విశేషం. వీకెండ్‌లో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకోవాలనుకునేవారికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది. ప్రతి శుక్రవారం విశాఖపట్నంలో మధ్యాహ్నం 2.00 గంటలకు తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కడంతో యాత్ర ప్రారంభమవుతుంది. తర్వాతరోజు ఉదయం 4.05 గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. హెూటల్‌లో రెడీ అయిన తర్వాత కాణిపాకం, శ్రీనివాస మంగాపురంలోని ఆలయాలను సందర్శిస్తారు. అదేరోజు రాత్రికి తిరుపతిలో బస ఉంటుంది. మూడోరోజు ఉదయం శ్రీకాళహస్తి, తిరుచానూరు వెళతారు. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత తిరుమలలో ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉంటుంది. స్పెషల్ ఎంట్రీ దర్శనంద్వారా శ్రీవారిని దర్శించుకోవచ్చు. అనంతరం తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది. రాత్రి 8.30 గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కితే తెల్లవారి 11.30 గంటలకు వైజాగ్ చేరుకుంటారు. దీంతో యాత్ర సమాప్తమవుతుంది. కంఫర్ట్‌లో ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.12,375, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.13,250, స్టాండర్డ్‌లో ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.10,280, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.11,160 గా నిర్ణయించారు. కనీసం నలుగురు నుంచి ఆరుగురు వరకు బుక్ చేసుకునేవారికి ఇవి వర్తిస్తాయి. ఒకరు లేదంటే ఇద్దరు లేదంటే ముగ్గురు వరకు బుక్ చేసుకునేవారికి ప్యాకేజీ ధర కాస్తంత ఎక్కువగా ఉంది. కంఫర్ట్‌లో ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.12,695, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.15,200, సింగిల్ ఆక్యుపెన్సీకి రూ.25,510, స్టాండర్డ్‌లో ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.10,600, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.13,105, సింగిల్ ఆక్యుపెన్సీకి రూ.23,415 చెల్లించాలి.కంఫర్ట్ క్లాస్‌కు థర్డ్ ఏసీ ప్రయాణం, స్టాండర్డ్ క్లాస్‌కు స్లీపర్ క్లాస్ ప్రయాణం, ఏసీ హెూటల్‌లో బస, బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్, తిరుమలలో స్పెషల్ ఎంట్రీ దర్శనం, కాణిపాకం, శ్రీనివాస మంగాపురం, శ్రీకాళహస్తి, తిరుచానూర్ ఆలయాల్లో దర్శనం టికెట్, ట్రావెల్ ఇన్స్యూరెన్స్ కవరవుతాయి. ప్యాకేజీ బుక్ చేయడానికి https://www.irctctourism.com వెబ్‌సైట్‌ను సందర్శించాలి

## ఎన్‌హెచ్‌ఆర్‌సి జాతీయ సమావేశం, అవార్డుల సమ్మేళనం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఎన్‌హెచ్‌ఆర్‌సి రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ సమావేశం, అవార్డుల సమ్మేళనం కార్యక్రమం ఆదివారం విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. మానవ హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా అక్కడ ఎన్‌హెచ్‌ఆర్‌సి బాధితులకు అండగా ఉంటుందన్నారు. ఏ రాజకీయ పార్టీతో ఎన్‌హెచ్‌ఆర్‌సికి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. తమ సంస్థ స్వయం ప్రతిపత్తితో పని చేస్తుందని. మానవ హక్కులను కాపాడటమే లక్ష్యమని చెప్పారు. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం, వారి హక్కులను సంరక్షించుకునేలా సంస్థ పని చేస్తుందని వివరించారు. హక్కుల ఉల్లంఘనకు గురైన బాధితులకు భరోసాగా నిలుస్తామని తెలిపారు. గత రెండేళ్లల్లో 536 కేసులు తమ కౌన్సిల్ దృష్టికి రాగా, 360 కేసులను విజయవంతంగా పరిష్కరించినట్టు వెల్లడించారు. స్వచ్ఛందంగా సేవ చేసేవారు తమ కౌన్సిల్లో సభ్యులుగా చేరవచ్చని పిలుపునిచ్చారు. సంస్థలో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు, బహుమతులు ప్రదానం చేశారు. సంఘం జాతీయ వైస్ చైర్మన్ కృష్ణకిశోర్‌ని ఘనంగా సన్మానించారు. హైకోర్టు న్యాయవాది రజనీ, తెలంగాణ పోలీస్ అకాడమీ ఫ్యాకల్టీ సభ్యురాలు రజిత, జాతీయ అడ్మినిస్ట్రేషన్ ఇన్చార్జి అజయ్, కౌన్సిల్ సభ్యులు బుల్లెట్ రవి, అమీన్బాయ్, వెంకటేశ్వరరావు, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహిత్య సేవాపురస్కారం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



'మాకొద్దీ నల్లదొరతనం' అంటూ నినదించిన తొలి అంబేద్కరిస్టు కవి కుసుమ ధర్మన్న పేరిట ఆయన మనవరాలు డా. రాధా కుసుమ ఏర్పాటు చేసిన 'కుసుమ ధర్మన్న కళాపీఠం' విజయవాడకు చెందిన నవమల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీని సాహిత్యసేవా పురస్కారానికి ఎంపిక చేసింది. కలిమిశ్రీ గత మూడున్నర దశాబ్దాలుగా పత్రికారంగంతో మమేకమై వున్నారు. ఆంధ్రపత్రికతో మొదలైన ఆయన ప్రస్థానం తరువాత ఆంధ్రజ్యోతి, జ్యోతిచిత్ర, విద్య, ధ్యానమాలిక, రేపటికోసం పత్రికల్లో వివిధ హెూదాల్లో కొనసాగింది. భారతి సాహిత్య మాసపత్రిక చివరి మూడు సంచికల్లో పని చేసిన అనుభవం ఆయన సొంతం. ప్రస్తుతం గత 16 సంవత్సరాలుగా నవమల్లెతీగ సాహిత్య మాసపత్రికను నిరాటంకంగా నడుపుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది సాహితీవేత్తలకు ఆ పత్రికలో చోటు కల్పిస్తున్నారు. ముఖ్యంగా కొత్తతరం సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో ముందడుగు వేస్తున్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం మరియు మల్లెతీగ సాహిత్య సేవాసంస్థల ద్వారా ఎన్నో సాహిత్య కార్యక్రమాలు చేస్తున్నారు. మల్లెతీగ సాహిత్య పురస్కారంతో ఈతరం కవులు రాస్తున్న మంచి కవిత్వాన్ని రికార్డు చేస్తున్నారు. దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న గారు 'జయభేరి' పత్రిక నడిపి సమాజాన్ని ఎంతో చైతన్యపరిచారు. కలిమిశ్రీని ఈ పురస్కారానికి ఎన్నుకోవడానికి ప్రధాన కారణం- ఆయన ఎంతో నిబద్ధతతో విలువలతో కూడిన నవమల్లెతీగ సాహిత్య మాసపత్రికను నడపడం, సాహితీసేవా కార్యక్రమాలు నిర్వహించడమేనని కళాపీఠం పురస్కార కమిటీ భావించింది. జులై 16న విజయవాడలో జరిగే ప్రత్యేక సాహిత్య కార్యక్రమంలో కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహిత్యసేవా పురస్కారాన్ని కుసుమ ధర్మన్న కళాపీఠం అందజేస్తుంది. ఈ అవార్డుకు రూ.11,116/-ల నగదుతో జ్ఞాపిక, శాలువాతో సత్కారం వుంటుంది.

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి ప్రారంభమైన ఏడవ భారత్ గౌరవ్ "పుణ్యక్షేత్ర యాత్ర" రైలు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
భారత్ గౌరవ్ రైళ్లు దక్షిణ మధ్య రైల్వేలోని రైలు వినియోగదారుల నుండి భారీ స్పందనను పొందుతూ, రెండు తెలుగు రాష్ట్రాల నుండి రైలు ప్రయాణీకులకు ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తూ టూరిస్ట్ సర్క్యూట్ రైలుగా ప్రారంభించబడి, ఈ రైలు 6 యాత్రలు పూర్తి చేసిన తర్వాత ఈ రోజు అనగా జూన్ 28, 2023న 7వ యాత్ర సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి ప్రారంభించింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి 7వ భారత్ గౌరవ్ రైలు ప్రయాణాన్ని, ఈ యాత్ర లోని వృద్ధ ప్రయాణీకురాలు అయిన కామాక్షిరావు హట్టి ప్రారంతభించారు. ఈ ప్రారంభోత్సవంలో ఐఆర్‌సీటీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ పి.రాజ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లోని రైలు ప్రయాణీకులకు దేశంలోని తూర్పు మరియు ఉత్తర భాగంలోని కొన్ని పురాతన మరియు చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పించుతుంది. సికింద్రాబాద్‌తో పాటు, రెండు తెలుగు రాష్ట్రాలలోని కాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట మొదలైన రైల్వే స్టేషన్లలో రైలులో ఎక్కే / దిగే సౌకర్యాన్ని అందిస్తుంది. ప్రయాణీకులను 9 రోజులలో పూరి, కోణార్క్, గయా, వారణాసి, అయోధ్య మరియు ప్రయాగ్‌రాజ్ వంటి ముఖ్యమైన ప్రదేశాలకు తీసుకువెళతారు. ఈ రైలు అందించే అపూర్వ అవకాశం కారణంగా, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి మాత్రమే కాకుండా, మార్గంలోని స్టేషన్ల నుండి కూడా ప్రయాణీకులు భారత్ గౌరవ్ రైలు సేవలను పొందేందుకు ముందుకు వచ్చారు. అన్నివర్గాల రైలు ప్రయాణికుల ఆదరణను ప్రతిబింబిస్తూ రైలులో 2ఎసి(1), 3ఎసి(3) మరియు స్లీపర్(7)ల మిశ్రమ కూర్పుతో ఎసి మరియు నాన్-ఎసి ప్రయాణీకులకు సేవల అవకాశాన్ని అందిచడము వలన సికింద్రాబాద్ స్టేషన్‌తో పాటు మార్గంలోని స్టేషన్ల నుండి కూడా చేరే రైలు ప్రయాణికులు ఈ సేవలను అందుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, దక్షిణ మధ్య రైల్వే ద్వారా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుకు ప్రయాణికుల నుండి విశేష స్పందన లభించడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రయాణీకులకు వ్యక్తిగత ప్రయాణ అంశాలను ప్లాన్ చేయడంలో ఇబ్బంది లేకుండా సాంస్కృతికంగా ప్రముఖ మరియు చారిత్రక ప్రదేశాలను సందర్శించడానికి రైలు గొప్ప అవకాశాన్ని కల్పిస్తుందని ఆయన తెలియజేశారు. భారత్ గౌరవ్ రైళ్లు దేశంలో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేస్తాయని కూడా ఆయన పేర్కొన్నారు.



Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-5 Papaiah Street, Seethurampuram, VIJAYAWADA, Krishna District , Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh.
Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri999@gmail.com